

ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయంలో ప్రవేశాలు

యోగివేమన విశ్వవిద్యాలయంలో మంగళవారం నుంచి పీజీలో ప్రవేశాల కోసం వెబ్ కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్ ప్రారంభం కానుంది. - 8లో



ఆత్మస్థైర్యంతో విధులు నిర్వర్తించాలి

అటవీ శాఖ అధికారులు, సిబ్బంది ఆత్మస్థైర్యంతో పని చేయాలని డీఎఫ్‌ఓ సందీప్‌రెడ్డి అన్నారు. అటవీ అమరవీరులకు ఆయన నివాళి అర్పించారు. - 8లో

గరిష్టం/కనిష్టం 33.6 /27.9

వాతావరణం

జిల్లాలో సోమవారం 27.9 – 33.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

– కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

వన్‌టైం సెటిల్‌మెంట్ సప్లిమెంటరీకి అవకాశం

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో 2015, 2016, 2017, 2018, 2019 విద్యాసంవత్సరాలకు సంబంధించి తృతీయ సంవత్సరం పరీక్షలు రాసి ఉత్తీర్ణులు కాని విద్యార్థులకు వన్‌టైం సెటిల్‌మెంట్ పరీక్షలకు అవకాశం కల్పించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి. రవీంద్రనాథ్ తెలిపారు. పరీక్షల్లో పాస్‌కాకుండా మిగిలిపోయిన సబ్జెక్టులపై సప్లిమెంటరీ పరీక్షల కోసం చిట్టచివరి అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఫీజు, చలానా ద్వారా చెల్లించాలని సూచించారు. పూర్తి వివరాలకు కళాశాల పరీక్షల విభాగంలో సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షలు ప్రారంభం

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ కళాశాలల విద్యార్థులకు ఇన్‌స్టంట్ పరీక్షలు ఈనెల 12 నుంచి నిర్వహించనున్నట్లు వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి తెలిపారు. వైవీయూలోని ఏపీజే అబ్దుల్‌కలాం కేంద్ర గ్రంథాలయంలో ఈ పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. 5వ సెమిస్టర్‌లోని అన్ని పేపర్లు, 1 నుంచి 4వ సెమిస్టర్ వరకు ఒక్కో పేపర్ తప్పిన విద్యార్థులను పరీక్షలకు అనుమతిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్స్, కళాశాల జారీచేసిన ఐడెంటిటీ కార్డుతో పరీక్షకు హాజరుకావాలని సూచించారు.

అరుణాచలంకు ప్రత్యేక సర్వీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రీజియన్ నుంచి ఈనెల 28వ తేదిన అరుణాచల గిరి ప్రదర్శన కోసం తిరువన్నామలైకు పలు డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ పి.గోపాల్‌రెడ్డి తెలిపారు.కడప డిపో నుంచి ఉదయం 5 గంటలకు, రాత్రి 9 గంటలకు అరుణాచలానికి బస్సులు బయలుదేరుతాయన్నారు.అలాగే జమ్మలమడుగు డిపో నుంచి రాత్రి 9.15 గంటలకు, మైదుకూరు డిపో నుంచి పోరుమామిళ్లలో ఉదయం 6.00 గంటలకు, రాత్రి 7 గంటలకు మరో సర్వీసు, బద్వేలు డిపోలోని పోరుమామిళ్లలో ఉదయం 5.00 గంటలకు, పులివెందుల డిపో నుంచి ఉదయం 8.00 గంటలకు, ప్రొద్దుటూరు డిపోనుంచి సాయంత్రం 7.45 గంటలకు తిరువన్నామలైకి బస్సు సర్వీసులు ఉన్నాయని వివరించారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


17న సమావేశం

కడప కోటిరెడ్డిసర్కిల్ : రైల్వే ఉద్యోగుల కో–ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం ఈనెల 17న నిర్వహించనున్నట్లు సొసైటీ ప్రెసిడెంట్ ఎండీ హుసేన్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో సొసైటీ అభివృద్ధి, ప్లాట్ల డెవలప్‌మెంట్ గురించి చర్చిస్తామని పేర్కొన్నారు. సమావేశానికి హాజరయ్యే సభ్యులు తమకు సంబంధించి ప్లాట్ డాక్యుమెంట్లు, షేర్ క్యాపిటల్ రుసుము రూ. 330లను తీసుకురావాల్సి ఉంటుందన్నారు. సభ్యులందరూ సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

రేపు ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి రెజ్లింగ్ ఎంపికలు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్‌ఆర్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 13న జిల్లాస్థాయి రెజ్లింగ్ ఎంపికలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలబాలికలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు డ్రస్ కోడ్‌తో పాటు ఎలిజిబిలిటీ ఫాం తీసుకురావాలని సూచించారు. అకడమిక్ మానిటరింగ్ యాప్‌లో నమోదు చేసిన క్రీడాకారులను మాత్రమే అనుమతిస్తామని తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు వారి క్రీడాకారులను సిద్ధం చేసుకుని ఈనెల 13వ తేదీ ఉదయం 9 గంటలకు హాజరుకావాలని సూచించారు.

15 నుంచి ఒంటిమిట్టలో పవిత్రోత్సవాలు



ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండ రామ స్వామి ఆలయంలో ఈ నెల 15 నుంచి పవిత్రోత్సవాలు నిర్వమిస్తున్నట్లు ఆలయ డిప్యూటీ ఈవో నటేష్ బాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ... ఏడాది పాటు స్వామి వారికి చేసే పూజల్లో , ఉత్సవాల్లో, తెలిసి తెలియక కలిగిన దోషాలను నివారించేందుకు ఈ పవిత్రోత్సవాలను నిర్వహిస్తారన్నారు. 15వ తేదీ అంకురార్పణతో పవిత్రోత్సాలు ప్రారంభమవుతాయన్నారు.16న పవిత్ర ప్రతిష్ఠ, 17న పవిత్ర సమర్పణ, 18న పూర్ణాహుతి, పవిత్ర విసర్జన ఉంటుందని తెలిపారు.

పంటల లెక్క.. ఇక పక్కా

- జిల్లాలో ముమ్మరంగా ఈ క్రాపు నమోదు
- ఇప్పటివరకు 81.59 శాతం పూర్తి
- ఈ నెల 15 నాటికి పూర్తి చేసేందుకు కసరత్తు



కడప మండల పరిధిలోని నానేపల్లిలో ఈ క్రాపు నమోదు చేస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్

కడప అగ్రికల్చర్ : జిల్లాలో ఈ క్రాపు నమోదు కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. ఈ క్రాపు నమోదులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ ఏడాది ఈ– కర్షక్ యాప్‌ను కొత్తగా ప్రవేశపెట్టింది. ఈ నూతన విధానంలో పంటల లెక్క మరింత పక్కాగా తేలనుంది. ఈ విధానం అమలులో భాగంగా ఈ క్రాపు నమోదు ప్రక్రియ జిల్లాలో వేగవంతం చేశారు. జిల్లావ్యాప్తంగా 36 మండలాల పరిధిలో వ్యవసాయ, ఉద్యాన పంటలకు సంబంధించి 1,86,288.648 ఎకరాల పంటలను సాగు చేశారు. ఇప్పటివరకు 1,51,983.94 ఎకరాల్లో ఈ క్రాపు నమోదై 81.59 శాతంగా ఉంది. వందశాతం పూర్తి కావాలంటే ఇంకా 34,304.70 ఎకరాల్లో ఈ క్రాపు నమోదు చేయాల్సి ఉంది. ఇందుకు సంబంధించి ఈ నెల 15వ తేదీ వరకు గడువు ఉంది. అంతలోపు పూర్తి చేసేందుకు వ్యవసాయ అధికారులు ముమ్మురంగా కృషి చేస్తున్నారు.

గతంలో ఇలా...

గతంలో ఏయే సర్వే నెంబర్లలో రైతులు ఏయే పంటలు సాగు చేస్తున్నారో వ్యవసాయ విస్తరణాధికారి నమోదు చేసి వ్యవసాయశాఖ ద్వారా ప్రభుత్వానికి నివేదిక ఇచ్చేవారు. గతంలో ఈ క్రాపు బుకింగ్ చేసే విధానంలో యాప్‌లో సర్వే నెంబర్ నమోదు చేసి ఏదో ఒక పొలం వద్ద రైతును నిలబెట్టి ఫొటో తీసేవారు. అంతేగాక గ్రామంలోని పెద్ద రైతులు నుంచి సమాచారం తీసుకోవడం. లేదా రైతు చెప్పింది మాత్రం నమోదు చేయడం చేసేవారు. దీంతో పూర్తిస్థాయిలో స్పష్టత ఉండటం లేదని ప్రభుత్వం గుర్తించింది. దీంతో ఈ కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. గ్రామ వ్యవసాయ సహాయకుల ట్యాబ్‌లో నూతన సాఫ్ట్‌వేర్ అప్‌లోడ్ చేసి దాని సహాయంతో ఈ క్రాపు నమోదు చేస్తున్నారు. ఇందులో కొత్తదనం ఏమిటంటే గ్రామ వ్యవసాయ సహాయకులకు ఈ కర్షక్ యాప్ జియోఫెన్సింగ్‌తో అనుసంధానమై ఉంటుంది. దీంతో సంబంధింత సర్వే నెంబర్ పొలానికి వెళ్లినప్పుడు మాత్రమే వివరాలు కనిపించేలా మాడ్యూల్ రూపొందించింది. సర్వే నెంబర్‌కు వెళ్లినప్పుడు గూగుల్‌లో జియోఫెన్స్ ద్వారా ఆ లోకేషన్‌కు చేరుకుంటుంది. పొలానికి దగ్గరగా ఉన్నప్పుడు మాత్రమే సర్వే నెంబర్ వివరాలు యాప్‌లో కనిపిస్తాయి. అప్పుడే నమోదు చేయాల్సి ఉంటుంది. దీంతో లెక్క పక్కాగా వస్తుంది.

పారదర్శకంగా ఉండేందుకు....

ఈ క్రాపు నమోదును సెప్టెంబర్ 15 తేదీలోపు పూర్తి చేసేలా వ్యవసాయశాఖ కార్యచరణను సిద్ధం చేసింది. పంటల నమోదు పారదర్శకంగా ఉండేందుకు ఉన్నతాధికారులు తనిఖీలు చేయనున్నారు. మండల స్థాయిలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మొదలుకుని కలెక్టర్ వరకు తనిఖీ చేయనున్నారు. ఇందులో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ 10 శాతం రికార్డులను, డిప్యూటీ తహశీల్దారు 5 శాతం, తహశీల్దారు ఒక శాతం, ఏవో,ఉద్యాన, సెరికల్చర్ అధికారి 10 శాతం, ఏడీఏలు 5 శాతం, జిల్లా వ్యవసాయ అధికారి, ఉద్యానశాఖ అధికారి 3 శాతం, జేసీ 2 శాతం ,కలెక్టర్ ఒక్కశాతం రికార్డులను తనిఖీ చేస్తారు. తర్వాత సోషల్ ఆడిట్ నిర్వహించాల్సి ఉంటుంది. ఆ తర్వాత జాబితా ప్రదర్శన, అభ్యంతరాల స్వీకరణ, ఉంటుంది. సంబంధిత షెడ్యూల్‌ను పూర్తి చేసి 30 నాటికి ఫైనల్ జాబితాను ఆర్‌బీకేలలో ప్రదర్శించాల్సి ఉంటుంది.

సెప్టెంబర్ 15 నాటికి పూర్తి చేస్తాం



ఈ క్రాపు నమోదు సెప్టెంబర్ 15 నాటికి పూర్తి చేస్తాం. ఇప్పటి వరకు 1,86,288.64 ఎకరాలకుగాను 1,51,983.94 ఎకరాల్లో ఈ క్రాపు నమోదు పూర్తి చేసి 81 శాతం మేర నమోదు చేశాం. మిగతా 34,304 ఎకరాల్లో బ్యాలెన్స్ ఉంది. ఈ క్రాపు నమోదులో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా అన్ని రకాల జాగ్రత్తలను తీసుకున్నాం.

– అయితా నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి

టీడీపీ బంద్ విఫలం

- పనిచేసిన ప్రభుత్వ కార్యాలయాలు
- యథావిధిగా పనిచేసిన వాణిజ్య సముదాయాలు
- ఎక్కడా కనిపించని టీడీపీ క్యాడర్



కడపలో రోజు మాదిరిగానే జన సంచారం

కడప రూరల్ : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో ఆ పార్టీ సోమవారం బంద్‌కు పిలుపునిచ్చింది. జిల్లాలో ఎక్కడా బంద్ ప్రభావం కనిపించలేదు. కడప కోటిరెడ్డిసర్కిల్ ప్రాంతంలో మాత్రం కొద్దిపాటిగా నిరసన కార్యక్రమం జరిగింది. తెలుగు తమ్ముళ్లు కూడా ఎక్కడా తమ ఉనికిని చాటలేకపోయారు. వారంతా తమ నివాసాలకే పరిమితమయ్యారు. యథావిధిగా ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలు పనిచేశాయి. వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు రోజువారీగా కొనసాగాయి. బస్సులు అన్ని ప్రాంతాల్లో యథావిధిగానే తిరిగాయి. టీడీపీ బంద్ పిలుపు నేపథ్యంలో కొద్దిపాటిగా ప్రైవేటు విద్యా సంస్థలు మాత్రం మూతపడ్డాయి. అంతకు మినహాయిస్తే జిల్లా వ్యాప్తంగా జన జీవనం రోజువారీ లాగానే సాగింది. అసలు బంద్ ఉందనే ధ్యాసనే ఎవరూ పరిగణలోకి తీసుకోలేదు. ప్రజలు కూడా బంద్‌పై ఏమాత్రం ఆసక్తి చూపలేదు.

అరెస్టు చేస్తే బంద్‌లెందుకు?

జిల్లా వ్యాప్తంగా చంద్రబాబు అరెస్టుపై చర్చ సాగింది. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అవినీతి జరిగిందని జాతీయ దర్యాప్తు సంస్థలు కూడా ధృవీకరించాయి. ఈ నేపథ్యంలో సీఐడీ అధికారులు విచారణ కోసం చంద్రబాబు నాయుడును అదుపులోకి తీసుకోవడం జరిగింది. అంత మాత్రానికే టీడీపీ శ్రేణులు ఉలిక్కిపడటం ఎందుకని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సమగ్ర దర్యాప్తు అనంతరం వాస్తవాలు వెలుగు చూస్తాయి. అప్పుడు చంద్రబాబు దోషా, నిర్దోషా అనేది బయటపడుతుంది. అంత మాత్రానికే ఏదో జరిగిపోతుందని టీడీపీ శ్రేణులు అధికార పార్టీపై పనిగట్టుకుని ఆరోపణలు గుప్పించడం అత్యంత హాస్యాస్పదంగా ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

స్పందనలో అర్జీల స్వీకరణ



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

కడప సెవెన్‌రోడ్స్ : 'స్పందన' ద్వారా స్వీకరించిన అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని కలెక్టర్ విజయ్ రామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జరిగింది. కలెక్టర్‌తో పాటు ట్రైనీ కలెక్టర్ మౌర్య, డీఆర్వో గంగాధర్ గౌడ్ తదితరులు ఫిర్యాదులను స్వీకరించారు.

ఆరోగ్య సురక్ష ద్వారా మరిన్ని వైద్య సేవలు

'జగనన్న ఆరోగ్య సురక్ష' ద్వారా ప్రభుత్వం మరిన్ని వైద్య సేవలు అందించనుందని కలెక్టర్ వి.విజయ్ రామరాజు తెలిపారు. సోమవారం నగర పాలక సంస్థ కమీషనర్ ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌లతో కలిసి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 30న ప్రారంభించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అన్ని మండలాల్లోని సచివాలయాల స్థాయి నుంచి నిర్వహించాలన్నారు. ఇందులో అధికారులందరూ భాగస్వామ్యం కావాలన్నారు.

జగనన్నకు చెబుదాం... ప్రతి బుధ, శుక్రవారాల్లో జగనన్నకు చెబుదాం ఒక్కో మండలంలో జరుగుతుందని, ఈ శుక్రవారం మొదటగా వేముల మండలంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా

- శాంతి భద్రతల పరిరక్షణలో రాజీ లేదు
- నూతన ఎస్పీ సిద్దార్థ్ కౌశల్



కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ సిద్దార్థ కౌశల్

కడప అర్బన్ : జిల్లాలో ప్రజలకు నిరంతరం 24/7 అందుబాటులో ఉంటాను.. నేరాల తీవ్రత తగ్గించేందుకు కృషి చేస్తాననీ నూతన ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ అన్నారు. ఎవరైనా సరే శాంతిభద్రతలకు సంబంధించిన సమస్య ఉంటే వెంటనే వాట్సాప్, ఫోన్ కాల్ ద్వారా తెలియజేవచ్చని ఆయన పేర్కొన్నారు. జిల్లా నూతన ఎస్పీగా సిద్దార్థ్ కౌశల్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత జిల్లాలో విధులను నిర్వర్తించే అవకాశం తనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు సంబంధించిన సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు శ్రమిస్తామన్నారు. జిల్లాలో నేరాల తీవ్రతను తగ్గించేందుకు కృషి చేస్తామన్నారు.

జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ...

జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సిద్దార్థ్ కౌశల్, కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వి. విజయరామరాజును మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్ ఎస్పీకి శుభాకాంక్షలను తెలియజేశారు. ఎస్పీ సిద్దార్థ్ కౌశల్‌ను జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, డీఎస్పీలు, సీఐలు కలిసి శుభాకాంక్షలను తెలియజేశారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి

జిల్లాలో బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదులపై సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలనీ జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ 'స్పందన' కార్యక్రమంలో బాధితులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 'స్పందన' ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సైబర్‌క్రైమ్‌కు సంబంధించి ఎలాంటి సమస్య వున్నా టోల్ ఫ్రీ నెంబర్ 1930కు ఫిర్యాదు చేయవచ్చనీ ఎస్పీ సూచించారు.

మెరుగైన ఆరోగ్యమే ధ్యేయం

- ఈ నెల 15 నుంచి ఇంటింటి సర్వే
- సమీక్షా సమావేశంలో స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ అనిల్‌కుమార్



జగనన్న ఆరోగ్య సురక్ష సమావేశంలో మాట్లాడుతున్న స్టేట్ నోడల్ ఆఫీసర్ అనిల్‌కుమార్

కడప రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడమే ధ్యేయమని ఆ పథకం స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ కేవీఎస్ అనిల్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని చాంబర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకంలో భాగంగా ఈ నెల 15 నుంచి ఇంటింటి సర్వే ప్రారంభం అవుతుందని తెలిపారు. 30వ తేదీ నుంచి వైద్య శిబిరాల ఏర్పాటు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు పక్కా ప్రణాళికతో సిద్ధం కావాలని ఆదేశించారు. పౌరుల ఆరోగ్య అవసరాలను గుర్తించడానికి విలేజ్ క్లినిక్ పరిధిలో రెండు బృందాలు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్కిల్ స్కాంలో కర్త, కర్మ, క్రియ చంద్రబాబే

- ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్ బాషా
- మైదుకూరులో వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం
- రూ.3.15 కోట్లతో నిర్మించిన ఆస్పత్రి భవనాల ప్రారంభం



మైదుకూరులో సామాజిక ఆరోగ్య కేంద్ర ప్రారంభోత్సవంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్ బాషా, ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

మైదుకూరు : స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్కాంలో కర్త, కర్మ, క్రియ అన్ని మాజీ సీఎం చంద్రబాబేనని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్ బాషా అన్నారు. మైదుకూరులో సోమవారం వైఎస్సార్‌సీపీ నూతన కార్యాలయ భవనాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ, డిప్యూటీ సీఎం మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో బోగస్ కంపెనీలను సృష్టించి వందల కోట్లు దోచుకున్న ఘనత చంద్రబాబుదన్నారు. ఇన్నాళ్లు చట్టాలను చుట్టంగా చేసుకుని తప్పించుకుని తిరిగాడని.. ఇప్పుడు ఆయనను ఎవరూ రక్షించలేరని పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో రూ.378 కోట్లు స్వాహా చేసిన కేసులో చంద్రబాబును కోర్టు 14 రోజులు రిమాండ్ విధించిన విషయం తెలిసిందేనన్నారు. అవినీతికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేస్తే, దానికి రాజకీయ రంగు పులిమి టీడీపీ వారు రాష్ట్రంలో ఆందోళనలకు పూనుకోవడం శోచనీయమన్నారు. నేరారోపణలు వస్తే హుందాగా తీసుకుని తాను తప్పు చేయలేదని నిరూపించుకోవాలని కానీ, చిల్లర రాజకీయాలు చేయడమేమిటని ప్రశ్నించారు. అవినీతిపై ప్రశ్నిస్తామని చెప్పే దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ 2014–19 మధ్య కాలంలో టీడీపీ హయాంలో జరిగిన అవినీతిపై ఎందుకు ప్రశ్నించలేదో.., ఎందుకు అడ్డుకోలేదో చెప్పాలని సూటిగా ప్రశ్నించారు. నాయకులు, కార్యకర్తలు ఎంత రెచ్చగొట్టినా ప్రజల్లో స్పందన లేదని, చంద్రబాబు అవినీతికి పాల్పడినట్లు నమ్ముతున్నారని వారు పేర్కొన్నారు. నేర చరిత్ర ఉన్న వ్యక్తికి అండగా లేకపోతే పోలీసులపై ఆరోపణలు చేస్తారా అని మండిపడ్డారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ నేతృత్వంలో రాష్ట్రంలో ఉన్న ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టి అల్లకల్లోలం సృష్టించడమే చంద్రబాబు, లోకేష్ ఉద్దేశమని అన్నారు.

అవినీతికి నిలయం టీడీపీ:ఎమ్మెల్యే

టీడీపీ పాలన అంతా అవినీతిమయమేనని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఆరోపించారు. మైదుకూరు నియోజవకర్గ టీడీపీ నాయకులు కోట్ల రూపాయల అవినీతికి పాల్పడగా, రాష్ట్ర స్థాయిలో చంద్రబాబు వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని ధ్వజమెత్తారు. ఇప్పటివరకు తన తప్పులను కప్పిపుచ్చుకుంటూ చంద్రబాబు నెట్టుకొచ్చాడని, ఇకపై అలాంటివి చెల్లవని అన్నారు. న్యాయస్థానాలు నిక్కచ్చిగా విచారిస్తాయని పేర్కొన్నారు. తన అరెస్టుపై డీజీ స్థాయి అధికారులపై చంద్రబాబు ఆరోపణలు చేయడం శోచనీయమన్నారు. లోకేష్ తనను నాయకుడిగా భావిస్తున్నాడు కానీ అతని మాట తీరు హుందాగా ఉండటం లేదన్నారు. తాము అధికారంలోకి వస్తే 20కిపైగా క్రిమినల్ కేసులు ఉన్నవారికి పదువులు ఇస్తామని లోకేష్ చెబుతున్నారని అన్నారు. ఇదేనా వారి పార్టీ, క్రిమినల్స్‌కా పదవులు ఇచ్చేది అని ధ్వజమెత్తారు. టీడీపీ పని అయిపోయిందన్నారు. చంద్రబాబుకు శిక్ష తప్పదని పేర్కొన్నారు. మైదుకూరులో ఇన్నాళ్లు 30 పడకల ఆస్పత్రి నిర్లక్ష్యానికి గురైందని, సీఎం వైఎస్ జగన్ నాబార్డు నిధులతో ఆధునీకరించేందుకు చర్యలు చేపట్టారని తెలిపారు. ఆ మేరకు రూ.3.15 కోట్లతో నూతన భవనాన్ని నిర్మించినట్టు వివరించారు. మైదుకూరులో 100 పడకల ఆస్పత్రిని మంజూరు చేశారని, భూ సమస్యల వల్ల పనులు ప్రారంభించలేదన్నారు. రూ.34 కోట్లతో స్టాఫ్ క్వార్టర్స్‌తో సహా ఆస్పత్రి నిర్మిస్తామన్నారు. ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ మాట్లాడుతూ ఏ ప్రభుత్వ హయాంలో లభించని గుర్తింపు సీఎం జగన్ బీసీలకు ఇచ్చారని కొనియాడారు.

సీహెచ్‌సీ ఆస్పత్రి భవనాలు ప్రారంభం

మైదుకూరు సామాజిక ఆరోగ్య కేంద్రం (30 పడకల ఆస్పత్రి) ఆధునీకరణలో భాగంగా నాబార్డు నిధులు రూ.3.15 కోట్లతో నిర్మించిన నూతన భవనాలను ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ప్రారంభించారు. వ్యవసాయశాఖ ప్రభుత్వ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి, మైదుకూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు మాసీమ బాబు, మిషన్ శక్తి సభ్యురాలు మూలే సరస్వతి, పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ సలహాదారుడు నాగార్జునరెడ్డి, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం ఆచారి, ఆప్కో డైరెక్టర్ వెంకటేశు, మార్కెట్‌కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు అచ్చుకట్ల కరీముల్లా, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కిరణ్మయి, నియోజకవర్గంలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుపతి-జల్నా రైలు రద్దు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప మీదుగా నడుస్తున్న తిరుపతి–జల్నా–తిరుపతి (07413/14) రైలును రద్దు చేసినట్లు కడప రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎ.జనార్దన్ తెలిపారు. బీహార్‌లోని చాప్రా రైలు యార్డులో రీ మోడలింగ్ పనులు జరుగుతున్న కారణంగా ఈ రైతులను తిరుపతి–జల్నాల మధ్య ఈనెల 19, 26, అక్టోబరు 3, 10వ తేదీలలో రద్దు చేశారన్నారు. అలాగే జల్నా–తిరుపతి మధ్య ఈనెల 24, అక్టోబరు 1, 8, 15 తేదీలలో రద్దు చేశారన్నారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గుర్తించి వారి ప్రయాణానికి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

గాయపడిన వ్యక్తి మృతి


గంగయ్య (ఫైల్)

పులివెందుల రూరల్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని వెలమవారిపల్లె రింగు రోడ్డు సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి సోమవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వెలమవారిపల్లెకు చెందిన గంగయ్య(58) పులివెందుల పట్టణంలో వివాహానికి హాజరై ఇంటికి బైక్‌పై వెళ్తుండగా.. వేంపల్లె నుంచి పులివెందులకు వస్తున్న స్కార్పియో ఢీకొంది. ఈ సంఘటనలో ఆయనకు తీవ్ర గాయాలు కావడంతో తిరుపతిలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స చేసి బెంగళూరుకు రెఫర్ చేశారు. బెంగళూరుకు తీసుకెళ్తుండగా మార్గంమధ్యలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ


స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న అడిషనల్ డైరెక్టర్ అనిల్‌కుమార్

కడప రూరల్ : కడప నగరంలోని స్కానింగ్ సెంటర్లను మెడికల్ అండ్ హెల్త్ అడిషనల్ డైరెక్టర్ (ఎంసీహెచ్) డాక్టర్ కేవీఎన్ఎస్ అనిల్‌కుమార్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్కానింగ్ సెంటర్స్ వివరాలు, వాటి నిర్వహణ తదితర అంశాలపై ఆరా తీశారు. నిబంధనల ప్రకారం స్కానింగ్ కేంద్రాలను నిర్వహించాలని ఆదేశించారు. నిబంధనలను అతిక్రమించే కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయంలో ప్రవేశాలు

- బోధన, పరిశోధనలో మేటిగా వైవీయూ
- నేటి నుంచి ప్రవేశాలకు వెబ్ ఆప్షన్స్
- హెల్ప్ సెంటర్‌లు ఏర్పాటు

వైవీయూ : బోధనలోను, పరిశోధనలోనూ యోగివేమన విశ్వవిద్యాలయం ప్రగతిపథంలో ముందుకు సాగుతోంది. 2006లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైన విశ్వవిద్యాలయం అనతికాలంలోనే అగ్రవిశ్వవిద్యాలయంగా వెలుగుతోంది. న్యాక్ ఏ గ్రేడ్ సాధించడంతోపాటు ఇటీవలే సైంటిఫిక్ ఇండెక్స్‌లో సైతం పలువురు వైవీయూ ఆచార్యులు చోటు దక్కించుకున్నారు. ఇంతటి ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందే అవకాశం విద్యార్థుల ముంగిటకు చేరింది. మంగళవారం నుంచి పీజీలో ప్రవేశాల కోసం వెబ్ కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో.. యోగివేమన విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు లభించే విద్య, సౌకర్యాలు, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక కథనం.

ప్రత్యక్ష పరిజ్ఞానం అందించే ప్రయోగశాలలు

విశ్వవిద్యాలయంలో తరగతులతోపాటు ప్రాక్టికల్స్‌కు పెద్దపీట వేస్తారు. భవిష్యత్తులో పరిశోధకులుగా రాణించాలంటే అవసరమైన పునాది పడేందుకు వేదికలు ప్రయోగశాలలే. వైవీయూలో ప్రతి సైన్స్‌కోర్సుకు అనుబంధంగా ప్రయోగశాలలు ఉండటం విశేషం. అదే విధంగా ఆర్ట్స్, హ్యూమానిటీస్, మేనేజ్‌మెంట్ విభాగాల్లో సైతం కోర్సుకు సంబంధించిన ప్రాక్టికల్స్ నిర్వహణకు అవసరమైన లాంగ్వేజీ ల్యాబ్‌లు, ప్రయోగ కేంద్రాలు ఉన్నాయి.

ఏపీజే అబ్దుల్‌కలాం గ్రంథాలయం

విశ్వవిద్యాలయంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కేంద్ర గ్రంథాలయం విద్యార్థులకు స్వాగతం పలుకుతుంది. ఇందులో దాదాపు 50,516 పుస్తకాలు, 20 వేల ఈ–జర్నల్స్ ఉన్నాయి.

పటిష్టమైన బోధన బృందం

విశ్వవిద్యాలయంలో దాదాపు 10 సెమినార్ హాల్స్ ఉండగా, దాదాపు ప్రతి గదిలోనూ డిజిటల్ బోధన అందించేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉంది. ఇంటరాక్టివ్ ప్యానెల్ బోర్డుల సహాయంతో బోధన అందిస్తారు. 39 మంది ప్రొఫెసర్లు, 57 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, అరుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 89 మంది అకడమిక్ కన్సల్టెంట్‌లతో పటిష్టమైన బోధన బృందం వైవీయూ సొంతం. దీంతోపాటు దాదాపు 40 జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో ఎంఓయూ కలిగి ఉండగా, 433 మంది పరిశోధకులు విశ్వవిద్యాలయంలో పరిశోధనలు కొనసాగిస్తుండటం విశేషం.


యోగివేమన యూనివర్సిటీ ముఖద్వారం

వేమన ప్లేఫీల్డ్స్

విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు కోసం సువిశాలమైన వేమన ప్లేఫీల్డ్స్ ఉన్నాయి. వ్యాయామవిద్య విభాగం ఆధ్వర్యంలో అధునాతన జిమ్‌సెంటర్, స్కేటింగ్ సెంటర్, రైఫిల్ షూటింగ్ అకాడమీలతోపాటు వివిధ క్రీడాంశాల్లో శిక్షణ పొందేందుకు అవసరమైన మైదానం, పరికరాలు అందుబాటులో ఉన్నాయి.

వసతిగృహాలు

విశ్వవిద్యాలయంకు అనుబంధంగా బాలురకు 4, బాలికలకు 2 మొత్తం 6 వసతిగృహాలు ఉన్నాయి. బాలురకు చెయ్యేరు1, 2, పాపాఘ్ని 1, 2 వసతిగృహాలు ఉండగా, బాలికలకు పెన్నా, చిత్రావతి వసతి గృహాలు ఉన్నాయి. వీటికి అనుబంధంగా పరిశుభ్రమైన, రుచికరమైన భోజనం అందించే భోజనశాలలు ఉన్నాయి.

హెల్ప్‌సెంటర్‌లు ఏర్పాటు

ఏపీపీజీసెట్–2023 ప్రవేశాల ప్రక్రియకు సంబంధించి విద్యార్థులకు రిజిస్ట్రేషన్, వెబ్‌ఆప్షన్స్ ఇచ్చుకునేందుకు విశ్వవిద్యాలయం రెండు ఉచిత హెల్ప్‌సెంటర్‌ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. వైవీయూతోపాటు, కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో హెల్ప్‌సెంటర్‌లను ఏర్పాటు చేయనున్నట్లు వైవీయూ అధికారులు పేర్కొన్నారు.

ముఖ్యమైన తేదీలు	
వెబ్ కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్	12 నుంచి 20వ తేదీ వరకు
ఆన్‌లైన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్	13 నుంచి 22వ తేదీ వరకు
వెబ్ ఆప్షన్స్	18 నుంచి 23వ తేదీ వరకు
సీట్ల కేటాయింపు	ఈ నెల 26
రిపోర్టింగ్	28 నుంచి అక్టోబర్ 3 వరకు
తరగతులు ప్రారంభం	అక్టోబర్ 5 నుంచి

జాబ్‌డ్రైవ్‌లు.. ప్లేస్‌మెంట్స్..

విశ్వవిద్యాలయంలో తరచుగా జాబ్‌డ్రైవ్‌లు నిర్వహించడంతో దాదాపు 80 శాతం మేర విద్యార్థులు కోర్సు పూర్తయిన వెంటనే ఏదో ఒక ఉద్యోగం, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని వైవీయూ అధికారులు పేర్కొంటున్నారు. వివిధ కంపెనీలు, సంస్థలతో ఉన్న ఒప్పందం మేరకు విద్యార్థులకు నైపుణ్యాలను అందించి ఉద్యోగాలు సాధించేలా చేయడంలో వైవీయూ ముందంజలో ఉందని చెప్పవచ్చు. పలువురు విద్యార్థులు విదేశాల్లో సైతం పరిశోధనలు కొనసాగిస్తూ ఆర్జిస్తుండటం విశేషం. పూర్తి వివరాలకు డబ్లూడబ్లూడబ్లూ.వైవీయూ.ఈడీయూ.ఇన్ వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చు.

ఆహ్లాదకర వాతావరణంలో విద్య



ఆహ్లాదకరమైన వాతావరణంలో ఏర్పాటైన విశ్వవిద్యాలయం విద్యార్థులకు ఒక చక్కటి ఆప్షన్. నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాలు, పరిశుభ్రమైన వసతి గృహాలు అందుబాటులో ఉన్నాయి. వైవీయూ పరిధిలో 28 విభాగాల్లోని కోర్సుల్లో ప్రవేశాలు పొందే అవకాశం విద్యార్థులకు ఉంది. ఇక్కడ విద్యనభ్యసించిన వారు దేశంలోని పలు ప్రాంతాలతోపాటు విదేశాల్లో సైతం ఉద్యోగాలు, పరిశోధనలు చేస్తుండటం ఆహ్వానించదగ్గ పరిణామం.

– ఆచార్య చింతా సుధాకర్, వైస్ చాన్సలర్, వైవీయూ

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI | SAKSHI DIGITAL MEDIA GROUP | ఆంధ్రప్రదేశ్ ANDHRA PRADESH AP Pollution Control Board

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కర లేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు.

అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంట తీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా:

తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన ఫోన్ నంబరు : 97059 07418

అంతర పంటలపై దృష్టి సారించాలి


చీనీ తోటలో రైతులకు సూచనలు చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు

చాపాడు : ఉద్యానవన పంటలలో రైతులు అంతర పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని వెదురూరు గ్రామంలో ఆయన సోమవారం చీనీ, జామ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలని, వీటి ద్వారా అధిక ఆదాయం పొందవచ్చన్నారు. ఇదే క్రమంలో ఈ పంటల వల్ల ఎక్కువ కాలం పాటు రాబడి వస్తుందన్నారు. ఈ పంటలతోపాటు అంతర పంటలైన వేరుశనగ, మినుము, పెసర, రాగి తదితర పంటలను రైతులు సాగు చేయటం వల్ల అదనపు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ప్రతి రైతు తమ గ్రామ పరిధిలోని రైతు భరోసా కేంద్రాలను సంప్రదించి వ్యవసాయ సలహాలు, సూచనలతోపాటు, విత్తనాలు, ఎరువులు, పురుగుల నివారణ మందులు తీసుకెళ్లవచ్చన్నారు. అనంతరం వెదురూరులో రైతు భరోసా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి మ్యాగీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌డీపీఎల్ మద్యంపై నిఘా పెంచండి


చీకలబైలు బార్డర్ చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఎస్ఈబీ అధికారులు

మదనపల్లె : కర్ణాటక నుంచి ఆంధ్రప్రదేశ్‌లోకి నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్(ఎన్‌డీపీఎల్) మద్యం అక్రమ మార్గాల్లో ప్రవేశించకుండా ఎస్ఈబీ అధికారులు నిఘావ్యవస్థను పటిష్టం చేయాల్సిందిగా ఎస్ఈబీ మంగళగిరి డెప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య తెలిపారు. సోమవారం కర్ణాటక సరిహద్దులోని రామసముద్రం, చీకలబైలు ఎస్ఈబీ చెక్‌పోస్ట్‌లు, మదనపల్లె ఎస్ఈబీ స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. కర్ణాటక నుంచి పన్ను చెల్లించని మద్యం అన్నమయ్య జిల్లాలోకి ప్రవేశించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి, తరచుగా వాహన తనిఖీలు నిర్వహించాల్సిందిగా, నిఘా వ్యవస్థను పటిష్టపరచుకోవాల్సిందిగా ఆదేశించారు. ఇటీవల కర్ణాటక మద్యం, నాటుసారా కేసుల్లో అరెస్ట్ అయిన నిందితులను బైండోవర్ చేయాలని, తరచుగా నేరాలకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ నమోదుకు చర్యలు తీసుకోవాలని వివరించారు. సమావేశంలో ఎస్ఈబీ సీఐ శ్రీహరి రెడ్డి, ఎస్ఐ అంజాద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మేడా భవన్‌లో ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలు


కేక్‌ను కట్ చేసి నేతలకు తినిపిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

నందలూరు (రాజంపేట) : మేడా భవన్‌లో సోమవారం రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బర్త్‌డే కేక్‌ను ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి కట్ చేసి నేతలకు పంచిపెట్టారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరంతరం ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి కృషి చేస్తున్నారని కొనియాడారు. లోక్‌సభలో తనదైన శైలిలో ప్రజా సమస్యలపై గళం విప్పుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పీసీ యోగీశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు కృష్ణారావు యాదవ్, పట్టణ సచివాలయాల కన్వీనర్ వడ్డే రమణ, కూండ్ల రమణారెడ్డి, రాము యాదవ్, కటారు శేఖర్‌రెడ్డి, బీసీ నాయకులు వడ్డే శీను, నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీ అభిమానులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో విధులు నిర్వర్తించాలి


అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి

కడప అర్బన్ : అటవీ శాఖ అధికారులు, సిబ్బంది ఆత్మస్థైర్యంతో పని చేయాలని కడప డీఎఫ్ఓ పి.వి సందీప్‌రెడ్డి అన్నారు. జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా సోమవారం కడపలోని డివిజనల్ కార్యాలయంలో అటవీ అమరవీరుల స్థూపం వద్ద అటవీశాఖ అధికారులు పుష్పగుచ్ఛం వుంచి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ సంపద, వన్యప్రాణులను కాపాడే విషయంలో తమవంతు సహకారం ఎల్లప్పుడూ వుంటుందని తెలిపారు. సామాజిక విభాగం డీఎఫ్ఓ నాగార్జునరెడ్డి, ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్ఓ గురుప్రభాకర్ మాట్లాడుతూ సాంకేతిక టెక్నాలజీని ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. ఈక్రమంలోనే 2018లో సిద్దవటం రేంజ్‌లో తమిళ ఎర్రచందనం స్మగ్లర్స్ చేతిలో అసువులు బాసిన జిల్లా ప్రొటెక్షన్ వాచర్ అశోక్‌కుమార్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐఎఫ్ఎస్ ఆఫీసర్ శుభం, ఎఫ్ఆర్‌ఓలు బాలసుబ్రమణ్యం, శ్రీనివాసులరెడ్డి, నాయిమ్‌ఆలీ, కళావతి, ప్రణీతబాయి, డీఆర్‌ఓలు గుర్రప్ప, కరీముల్లా, ఎస్.ఓబులేసు, కె.ఓబులేసు, ఎఫ్ఎస్‌ఓలు శ్రీనివాసులు, బ్రహ్మయ్య, నాగరాజు, షకీల్ అహమ్మద్, ఖాజావల్లి, రెడ్డెయ్య, సురేష్‌బాబు బీట్ ఆఫీసర్స్, ఏబీఓలు, మినిస్టీరియల్ స్టాఫ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి మహిళకు తీవ్ర గాయాలు


గాయపడిన నాగరత్నమ్మ

మదనపల్లె : గ్యాస్ సిలిండర్ పేలి మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం సాయంత్రం మండలంలో జరిగింది. పోతబోలు పంచాయతీ సిద్ధమ్మగారిపల్లెకు చెందిన రిటైర్డ్ విద్యుత్ ఉద్యోగి వెంకటరమణ సోమవారం కొత్త సిలిండర్ తెచ్చి స్టవ్‌కు బిగించారు. ఆయన భార్య జి.నాగరత్నమ్మ(55) సాయంత్రం వంట చేస్తుండగా, సిలిండర్ నుంచి గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు చెలరేగి, సిలిండర్ పేలింది. ఈ ప్రమాదంలో నాగరత్నమ్మకు తీవ్ర గాయాలవడంతో కుటుంబ సభ్యులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తీసుకెళ్లారు.

ఎర్రచందనం సంరక్షణలో వైవీయూతో కలిసి పని చేస్తాం


వైవీయూ వీసీని కలిసిన ఏపీ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ బి.ఎం.కె. రెడ్డి

వైవీయూ : ఎర్రచందనం మొక్కలను సంరక్షించడంలో యోగివేమన విశ్వవిద్యాలయంతో కలిసి పని చేస్తామని ఆంధ్రప్రదేశ్ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ డాక్టర్ బి.ఎం.కె. రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వైవీయూకు విచ్చేసిన ఆయన వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైవీయూలో నిర్వహిస్తున్న ఎర్రచందనం మొక్కల ప్రాజెక్టు ప్రగతిని పరిశీలించేందుకు విచ్చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పరిశోధనల పరంగా, జీవవైవిధ్యాన్ని పరిరక్షించే విధంగా బోర్డు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డి, బొటానికల్ గార్డెన్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ ఆచార్య ఎ.మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదాయం పెంచాలి


కార్గో సేవలను ప్రారంభిస్తున్న ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ ద్వారా నడుస్తున్న కార్గో ఆదాయాన్ని పెంచేందుకు ప్రతి అధికారి కృషి చేయాలని ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జున రెడ్డి సూచించారు. ఆర్టీసీ కార్గో సేవల కాంట్రాక్టర్ మార్పు సందర్భంగా కడప ఆర్టీసీ బస్టాండు ఆవరణలోని కార్గో కార్యాలయంలో కొత్త కాంట్రాక్టర్ సింగ్ సొల్యూషన్స్ వారికి టెండరు ద్వారా విజయవాడ వారు నియమించడం జరిగింది. ఈ సందర్భంగా లాంఛనంగా సోమవారం కౌంటర్‌ను ప్రారంభించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్గో సేవల ద్వారా అతి తక్కువ ధరలతో స్వల్ప వ్యవధిలో వినియోగదారుల వస్తువులను గమ్య స్థానాలకు చేర్చడం జరుగుతుందన్నారు. వినియోగదారులు ఈ కార్గో సేవలను విరివిగా ఉపయోగించుకుని ఆర్టీసీ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప జోన్ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు, జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి, ఈఈ వెంకటరమణ, ఏటీఎం హరి, కార్గో మేనేజర్ జనార్దన్, అసిస్టెంట్ మేనేజర్లు కన్యాకుమారి, గోవర్ధన్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, కార్గో సిబ్బంది పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వృద్ధురాలి ఆత్మహత్య

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు పట్టణంలోని ప్రొద్దుటూరు రహదారిలో ఉన్న కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో ఆదివారం అర్ధరాత్రి రామసుబ్బమ్మ (65) అనే వృద్ధురాలు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఏఎస్ఐ మురళీయాదవ్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జమ్మలమడుగు పట్టణానికి చెందిన రామసుబ్బమ్మకు కొన్ని రోజుల నుంచి ఆరోగ్యం బాగలేదు. అంతే కాకుండా చూసుకునే వారు ఎవరూ లేకపోవడంతో కొంత కాలం నుంచి కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో ఉండేది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది, ఆత్మహత్య చేసుకుంది. సోమవారం గమనించిన వారు పోలీసులకు సమాచారం అందించారు. ఆమెకు ఒక కూతురు ఉంది. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

కుటుంబ సమస్యలతో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మదనపల్లె పట్టణం ఎస్‌బీఐ కాలనీకి చెందిన పెద్దరెడ్డెప్ప కుమారుడు పి.సహదేవ(52) కుటుంబ సమస్యలతో సోమవారం ఇంటి వద్దే పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

అదేవిధంగా కురబలకోట మండలం అంగళ్లు పెద్దదళితవాడకు చెందిన భార్గవ భార్య అలేఖ్య అలియాస్ బుజ్జి(22) కుటుంబ సమస్యలతో ఇంటి వద్దే పెట్రోల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆయా ఘటనల్లో గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను 108 ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ కేసులను సంబంధిత పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగ బాలుడి అర్జీపై స్పందించిన కలెక్టర్

స్మార్ట్‌ఫోన్, స్మార్ట్ పరికరం అందజేత


సులేమాన్‌కు సెల్‌ఫోన్, ఇతర పరికరాలు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : దివ్యాంగ బాలుడి అర్జీపై జిల్లా కలెక్టర్ స్పందించారు. అతనికి ఉపయోగపడే పరికరాలు అందజేశారు. అన్నమయ్య జిల్లా జేకే రాజుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సులేమాన్‌కు విద్యుత్ ప్రమాదంలో రెండు చేతులు కాలిపోయాయి. ఆగస్టు నెలలో రాయచోటి స్పందన కార్యక్రమంలో తనకు ఉపయోగపడే పరికరాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌ను కలిసి అర్జీ ద్వారా విన్నవించారు. సులేమాన్ పరిస్థితి చూసి స్పందించిన కలెక్టర్ వెంటనే తగు చర్యలు తీసుకోవాలని జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ దీనిని స్వయంగా పర్యవేక్షించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సోమవారం స్మార్ట్ ఫోన్, చేతులు లేని వారు ఉపయోగించే స్మార్ట్ పరికరాన్ని కలెక్టర్ స్వయంగా అందజేశారు. అలాగే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)తో పని చేసే ఖరీదైన బయోనిక్ హ్యాండ్స్‌ను కూడా త్వరలోనే అందిస్తామని ఆయన తెలిపారు. తన పరిస్థితి చూసి ప్రభుత్వ పరంగా తనకు అవసరమైన పరికరాలను అందజేయడంలో చొరవ చూపిన జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌కు సులేమాన్, అతని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వయోవృద్ధుల వికలాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు కృష్ణ కిశోర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బియ్యం పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు


కె.కొత్తపల్లెలో చౌక దుకాణాన్ని తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

కలకడ : ప్రభుత్వం అందించే ఉచిత చౌకబియ్యం, నిత్యావసర వస్తువులు జిల్లాలో ఎక్కడైనా అక్రమ నిల్వ ఉన్నా.. డీలర్లు కానీ, ఎండీయూ ఆపరేటర్లు కానీ అక్రమాలకు పాల్పడినా కేసులు తప్పవని కడప జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ రామక్రిష్ణ హెచ్చరించారు. సోమవారం మండలంలోని కె.కొత్తపల్లె, కె.దొడ్డిపల్లె, గంగాపురం, కోన గ్రామాలలోని ప్రభుత్వ చౌకదుకాణాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డీలర్లు అందుబాటులో ఉండాలని, ఎండీయూ ఆపరేటర్ వాహనంతో రాగానే అన్ని నిత్యావసర సరుకులు అందజేయాలని ఆదేశించారు. ప్రతి చౌకధరల దుకాణంలో విధిగా చౌకదుకాణ ఆథరైజేషన్ ఉండాలని, మొత్తం కార్డులు, ఏఏవై కార్డులు, అన్నపూర్ణ కార్డులు, పీహెచ్‌సీ కార్డులు, నోటీస్ బోర్డులో రోజువారి స్టాక్ వివరాలు విధిగా నమోదు చేయాలని పేర్కొన్నారు. మండల స్టాక్ పాయింట్ నుంచి తూకంతో వస్తువులు తీసుకోవాలని, తక్కువ తూకాలు వస్తున్నట్లు డీలర్లు చెప్పడం సరికాదన్నారు. తూకాలు తక్కువగా ఉంటే ఫిర్యాదు చేయాలని, లేకుంటే దిగుమతి చేసుకోరాదని అన్నారు. డీలర్లు అందుబాటులో ఉండి అధికారులకు రికార్డులు చూపాలని, లేనివారిపై సీజ్ చేసి తనిఖీ అనంతరం చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. తూకాలలో మోసాలకు పాల్పడితే కేసులు నమోదు చేయడం, తొలగించడం జరుగుతుందన్నారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఓ బాలగంగాధర్‌రెడ్డి, సిబ్బంది నాగేశ్వర్ రావు, హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.